పంటల బీమా.. లేదిక ధీమా



నిడమర్రులో యంత్రంతో వరి కోతలు



ధాన్యం పట్టుబడుల్లో చానమిల్లి రైతులు

- ఉచిత పంటల బీమా పథకానికి స్వస్తి
- రబీ నుంచి రైతులే ప్రీమియం చెల్లించాలి
- నోటిఫికేషన్ జారీ చేసిన కూటమి సర్కారు
- ఐదేళ్లు ప్రీమియం చెల్లించిన వైఎస్ జగన్ సర్కారు
- 21.8వేల మంది రైతులపై ఏటా రూ.4.26 కోట్ల భారం

నిడమర్రు: గత ప్రభుత్వంలో ఐదేళ్లగా రైతులకు ధీమా కల్పించిన ఉచిత పంట బీమా పథకం అమలుపై చంద్రబాబు సర్కారు చేతులెత్తేసింది. ఆ భారాన్ని రైతులపైనే మోపింది. ఫలితంగా అన్నదాతలను మరింత కష్టాల్లోకి నెట్టింది. మాది రైతుల ప్రభుత్వం.. రైతులకు అండగా ఉంటామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి మంత్రుల వరకూ ప్రగల్భాలు పలుకుతూనే నిండా ముంచేశారని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులపై పైసా భారం మోపకుండా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేశారు. ప్రస్తుతం కూటమి సర్కారు ఆ పథకానికి స్వస్తి పలికారు. రబీ నుంచి రైతులే బీమా చెల్లించుకోవాలని సీఎం చంద్రబాబు నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పంటల ఆధారంగానే పంటల బీమా

ఈ-పంట ఆధారితంగానే గత ప్రభుత్వం బీమా ప్రీమియం చెల్లించింది. ప్రకృతి విపత్తుల దృష్ట్యా పంటలు దెబ్బతింటే సత్వరం పరిహారం అందించేలా చర్యలు చేపట్టింది. ఉంగుటూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గత ప్రభుత్వ హయాంలో వివిధ ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన నాలుగు మండలాల్లోని 10,127 మంది రైతులకు రూ.51.58 కోట్లు పరిహారం అందించినట్లు గణాంకాలు చెపుతున్నాయి. రైతులకు ఎంతగానో మేలు చేసిన ఉచిత పంట బీమా పథకాన్ని రద్దు చేసి పాత పద్ధతిలో రైతులను భాగస్వామ్యం చేస్తూ ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. సమయంలేని కారణంగా ఖరీఫ్ సీజన్ వరకు ఈ-పంట నమోదు ప్రమాణికంగా ఉచిత పంటల బీమాను కొనసాగించాలని, రబీ 2024-25 సీజన్ నుంచి వలంటీర్ ఎన్‌రోల్‌మెంట్ మోడల్ పద్ధతిలో అమలు చేయనున్నట్లు సర్కారు స్పష్టం చేసింది.

గత ప్రభుత్వంలో ఉచిత పంట బీమా లబ్ధిదారుల వివరాలు

మండలం	రైతులు	అందిన లబ్ధి
ఉంగుటూరు	2,557	రూ.16.05 కోట్లు
భీమడోలు	1,226	రూ.17.22 కోట్లు
నిడమర్రు	1,550	రూ.4.92 కోట్లు
గణపవరం	4,794	రూ.13.39 కోట్లు
మొత్తం	10.127	రూ.51.58 కోట్లు

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) కింద కంపెనీలు నిర్దేశించిన ప్రీమియం మొత్తం (8శాతం)లో నోటిఫై చేసిన వ్యవసాయ పంటలకు గరిష్టంగా ఖరీఫ్‌లో 2శాతం, రబీలో 1.6 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం చొప్పున రైతులు తమ వాటా చెల్లించాలి. మిగిలిన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి.

రబీలో రూ.2,26 కోట్లు రైతులపై భారం

ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 36వేల ఎకరాల్లో వరి సాగుతోపాటు, మరో 18వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఎకరా వరి సాగుకి రూ.630 చొప్పున బీమా చెల్లించాల్సి ఉంటుంది. దీంతో నియోజకవర్గంలో వరి రైతులపై రూ.2.26 కోట్లు భారం పడనుంది. వచ్చే రబీ, ఖరీఫ్‌తో కలిపి ఏటా నియోజకవర్గంలోని రైతులపై రూ.4కోట్లకుపైగా భారం పడనుందని అంచనా. రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకునే ముందు తాము సాగు చేసిన పంటల వివరాలను తొలుత ఎన్‌పీఐసీ (జాతీయ పంటల బీమా పోర్టల్)లో ఎన్‌రోల్ చేసుకోవాల్సి ఉంది. ఆయా పంటలకు బ్యాంకులు రైతులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని మినహాయించుకుని మిగిలిన రుణాలను మంజూరు చేస్తాయి. ఆ మొత్తాన్ని బీమా కంపెనీలకు జమ చేస్తాయి. రుణాలు తీసుకోని వారు తగిన పత్రాలతో కామన్ సర్వీస్ సెంటర్స్, బ్యాంక్ బ్రాంచీలు, ఐసీ అపాయింట్‌మెంట్ చేసిన వ్యక్తుల ద్వారా లేదా వ్యక్తిగతంగా ఎన్‌సీఐసీ పోర్టల్లో ఎన్‌రోల్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

పథకాన్ని రద్దు చేయడం దుర్మార్గం



ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపోయిన రైతులను ఉచిత పంటల బీమా పథకం ఎంతగానో ఆదుకుంది. అలాంటి మంచి పథకాన్ని కూటమి ప్రభుత్వం ఎత్తివేయడం దుర్మార్గం. రైతులకు ఆర్థిక భరోసా కల్పించి ప్రభుత్వ పరంగా వారికి అండగా ఉండేందుకే గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేసింది. అన్ని పంటలకు ఈ పథకాన్ని వర్తింపచేసింది. ఉంగుటూరు నియోజకవర్గంలో 10 వేలకు పైగా రైతులకు రూ.50 కోట్లు బీమా పరిహారం చెల్లించాం.

– పుప్పాల వాసుబాబు, మాజీ ఎమ్మెల్యే

రైతు వ్యతిరేక విధానాలు తగవు



వ్యవసాయం దండగ అని చెప్పే చంద్రబాబు రైతులకు మేలు చేస్తారనుకోవడం భ్రమ. ఎన్నికల్లో అనేక హామీలతో రైతులను మభ్య పెట్టడం, అధికారంలోకి వచ్చాక వారిని నిలువునా ముంచడం చంద్రబాబుకు అలవాటే. రైతు వ్యతిరేక విధానాలు తగదు. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేయడంతో రైతులపై రెండు పంటలకు ఏటా రూ.4 కోట్లకు పైగా బీమా ప్రీమియం భారం పడనుంది.

– గొట్టుముక్కల విశ్వనాథరాజు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు

క్లుప్తంగా

మాజీ ఎంపీ శ్రీధర్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసిన పార్టీ నాయకులు

దెందులూరు: ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను ఆదివారం ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ కమిటీ మాజీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి సప్పా మురళి, నాయకులు తొత్తడి కృష్ణ కలిశారు. గ్రామాల్లో పార్టీ శ్రేణులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను ఆయనకు వివరించారు. అన్ని సర్దుకుంటాయని, ఓపిగ్గా ఉండాలని, పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో సమన్వయంతో కృషి చేయాలని కోటగిరి శ్రీధర్ నాయకులకు సూచించారు.

వన సమారాధనలతో ఐక్యత చాటాలి



కార్తీక వనసమారాధనలో వాసుబాబును సత్కరిస్తున్న కాపు సంఘీయులు

ఉంగుటూరు: కార్తీక వన సమారాధనలతో ఐక్యతను చాటాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం ఉంగుటూరు మండలం కాపు సంఘీయుల కార్తీక వన సమారాధన నారాయణపురం తోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వాసుబాబు మాట్లాడుతూ ఐక్యతతో ఉంటేనే ప్రభుత్వం నుంచి రావాల్సినవి సాధించుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. సంఘం నాయకులు ఎమ్మెల్యే ధర్మరాజును, మాజీ ఎమ్మెల్యే వాసుబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు అడపా శ్రీనివాసరావు, సూరిరెడ్డి శ్రీనివాసరావు, యాళ్ల దుర్గారావు, యాదగిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫిషర్‌మెన్ సొసైటీ అభివృద్ధికి కృషి



తోట దేవిడ్‌రాజు

దెందులూరు: దెందులూరు ఎస్సీ ఫిషర్‌మెన్ సొసైటీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని నూతనంగా ఎన్నికైన దెందులూరు ఎస్సీ ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు తోట డేవిడ్‌రాజు అన్నారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకోవడమే కాకుండా కమిటీని ఏకగ్రీవం చేసిన సొసైటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం నుంచి సభ్యులకు అందించే అన్ని రకాల రుణాలు, పెన్షన్లు మరింత పెంచేందుకు కృషి చేస్తానన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో దీపోత్సవం



27 దీపాలతో అలంకరించి పూజలు చేస్తున్న మహిళలు

దెందులూరు: కార్తీక మాసం సందర్భంగా ఆదివారం మండలంలోని కొత్తపల్లిలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం మహిళలు దీపోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి సంవత్సరం ఈ ఆలయంలో కార్తీక మాసంలో నెల రోజులు పాటు 27 దీపాలతో ప్రత్యేక అలంకరణ పూజలు చేస్తామని వివరించారు.

అందుబాటులో కొబ్బరి మొక్కలు

పెదవేగి : కొబ్బరి మొక్కలు అందుబాటులో ఉన్నాయని కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డ్ ఫీల్డ్ ఆఫీసర్ కె హరిదాస్ చెప్పారు. పెదవేగి మండలం వేగివాడలోని కొబ్బరి బోర్డు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనం కోసం ఏటా పొడవు, పొట్టి రకాలకు చెందిన 70 వేల నుంచి 80 వేల వరకు నాణ్యమైన కొబ్బరి మొక్కలను ఉత్పత్తి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఒక్కో పొడవు మొక్క ధర రూ.80, పొట్టి రకం మొక్క ధర రూ.100, ఎన్‌సీడీ మొక్క ధర రూ.250 చొప్పున అందుబాటులో ఉన్నాయని అన్నారు. పొలం గట్లపై కనీసం 10 మొక్కలు నాటిన రైతులు కూడా ఆర్థిక సాయం పొందవచ్చని, బోర్డ్ ద్వారా అమలు చేయబడిన కొబ్బరి విస్తీరణ పథకం ద్వారా మొక్క రకం, ప్రాంతం ఆధారంగా ఒక హెక్టారుకు రూ.6,500 నుంచి రూ.15,000 వరకు సబ్సిడీ పొందవచ్చని సూచించారు. ప్రతీ లబ్ధిదారునికి గరిష్టంగా 4 హెక్టార్ల వరకు, రెండు సమాన వార్షిక వాయిదాలతో సబ్సిడీని పొందవచ్చని తెలిపారు.

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ సేవలు ప్రశంసనీయం



భీమడోలులో సీపీ బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మండే సుధాకర్, విద్యార్థులు

భీమడోలు: తెలుగు భాషాభివృద్ధికి అవిరళ కృషి చేసిన బ్రిటిష్ దొర చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేశారు. అనంతరం సీపీ బ్రౌన్ 226వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బ్రౌన్ తన జీతాన్ని సైతం తెలుగు భాష సేవకే అంకితం చేశారని, మనుచరిత్ర, రంగనాథ రామాయణం, పాండితారాధ్య, చరిత్ర, దశావతార చరిత్ర వంటి కావ్యాలు బ్రౌన్ ద్వారానే అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ నిర్వహించనున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సద్వినియోగం చేసుకుని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు డీఎస్‌టీ అమర్‌నాథ్, జి.నాగమణి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యమణిసాయికి ఎమ్మెస్సీలో గోల్డ్ మెడల్



దివ్యమణిసాయి

భీమడోలు: భీమడోలు జంక్షన్ సమీపంలోని ద్వారకానగర్ ఏరియాకు చెందిన మద్దిపాటి దివ్యమణిసాయి ఎమ్మెస్సీ మెరైన్ బయాలజీ అండ్ ఫిషరీష్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభను చాటి బంగారు పతకం సాధించాడు. ఆంధ్రా యూనివర్శిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎమ్మెస్సీలో అత్యుత్తమ మార్కులు పొంది యూనివర్సిటీ టాపర్‌గా నిలిచాడు. సోమవారం దేశ ప్రథమ విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయ విద్యా దినోత్సవంలో భాగంగా వైజాగ్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో దివ్యమణిసాయి గోల్డ్ మెడల్ అందుకోనున్నాడు. గోల్డ్ మెడల్‌తో పాటు ప్రశంసా పత్రం అందిస్తారని దివ్యమణిసాయి, తల్లిదండ్రులు మద్దిపాటి లక్ష్మీతులసి, సతీష్ తెలిపారు. అదే విధంగా 2019-22లో ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో మూడేళ్ల డిగ్రీ బీఎస్సీ ఫిషరీష్ విభాగంలో కళాశాల టాపర్‌గా నిలిచారు. కళాశాలలో ఈనెల 16న నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో దివ్యమణిసాయి గోల్డ్ మెడల్‌ను అందుకోనున్నాడు. దివ్యమణిసాయిని యలమర్తి రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు రవితేజ ఎంపిక



మేడంకి రవితేజ

పెదవేగి : జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పెదవేగి మండలానికి చెందిన సచివాలయ ఉద్యోగి ఎంపికకావడంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆల్ ఇండియా ఉద్యోగ సివిల్ సర్వీస్ 2024-25 క్రీడల్లో పాల్గొనేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో అథ్లెటిక్స్ పోటీలు, సెలెక్షన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా పురుషుల 400 మీటర్ల రన్నింగ్ విభాగానికి మేడంకి రవితేజ ఎంపికయ్యాడు. పెదవేగి మండలం భోగాపురం సచివాలయంలో ఈయన ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అంతేకాకుండా ఇతను ఈనెల 9న విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ సెలెక్షన్స్‌లో రాష్ట వాలీబాల్ పురుషుల జట్టుకు ఎంపికయ్యారు. రవితేజ జాతీయస్థాయి టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ జట్టు తరపున ఆడనున్నారు. ఆదివారం భోగాపురం పంచాయతీ కార్యదర్శి భూపతిరాజు కృష్ణంరాజు తోటి సచివాలయ ఉద్యోగులు, రవితేజను అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పీఆర్టీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల కరువు భత్యం బకాయిలు విడుదల చేయాలని, మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణం బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సంపాదిత సెలవుల నగదు జమ చేయాలని, పదవీ విరమణ పొందిన వారికి చెల్లించాల్సిన సొమ్మును సకాలంలో వారి ఖాతాల్లో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నెలవారీ పదోన్నతులు పునరుద్ధరించి, ఉన్నత పాఠశాలల్లో పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలు భర్తీ చేయాలని, 117 జీఓను రద్దు చేయడంతో పాటు 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల నుంచి పూర్వపు ప్రాథమిక పాఠశాలలకు పంపాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 20 మంది విద్యార్థులకు ఒకరు, 60 మంది వరకూ ఇద్దరు మాత్రమే హేతుబద్ధీకరణ ద్వారా కేటాయించారని, ఈ ఉపాధ్యాయ నిష్పత్తిని పీఆర్టీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో పోస్టుల కేటాయింపు అగమ్య గోచరంగా ఉందని, 98 రోజులను ప్రాతిపదికగా తీసుకుని ఎస్ఏలను, ఎస్జీటీలను ఎప్పటికప్పుడు మార్చడం తగదన్నారు. ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ పనులు, యాప్‌ల భారం, వివిధ రకాల శిక్షణ వంటి బోధనేతర పనులను నిలుపుదల చేయాలని, లేని పక్షంలో పాఠశాలల్లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి ఆపరేటర్లను నియమించాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ ఉద్యోగ, కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

ఏలూరు (టూటౌన్): ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా విస్తృత సమావేశం 23న జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్నట్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు కూనపాముల విగ్నేష్ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్న సమావేశం ప్రాముఖ్యతను వివరిస్తూ ఏలూరు ఆర్ఆర్ పేట ఎస్ఆర్‌టూ వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ వివిధ కార్పొరేషన్లలో పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగ, కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై 23న చర్చిస్తామన్నారు. యూనియన్ కోశాధికారి నారాయణరావు సహాయ కార్యదర్శి ఎస్ శ్రీనివాసు పాల్గొన్నారు.

పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం



కొమిరేపల్లిలో ఫాగింగ్‌ను పర్యవేక్షిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

దెందులూరు: మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం కోసం పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం పోతునూరు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కొమిరేపల్లిలో ఫాగింగ్ నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పరిశుభ్రతకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రోగాల వ్యాప్తికి కారణమయ్యే దోమలు, ఈగలు పెరగకుండా ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



వాహనదారులను తనిఖీ చేస్తున్న పోలీసులు

గణపవరం: గణపవరం పోలీస్ ఐలెండ్ మూడు రోడ్ల కూడలిలో ఆదివారం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేశారు.ఈ తనిఖీల్లో మద్యం సేవించిన పలువురిపై కేసులు నమోదు చేశారు. ఎస్సై మణికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోటారు సైక్లిస్టును ఢీకొన్న కారు

ఉంగుటూరు: నారాయణపురం సెంటర్లో ఆదివారం మోటారుసైకిల్‌పై రోడ్డు దాటుతుండగా మెండ్యాల కృష్ణ అనే యువకుడిని చిన్నకారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణకు తీవ్రగాయాలు కాగా అతడిని హైవే అంబులెన్సులో తాడేపల్లిగూడెం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. సెల్‌ఫోను మాట్లాడుతూ మోటారుసైకిల్ నడుపుతుండగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలి



బీఎల్వోల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్

భీమడోలు: అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఏలూరు ఆర్డీవో డాక్టర్ అచ్యుత అంబరీష్ అన్నారు. మండలంలోని భీమడోలు, సూరప్పగూడెంలోని రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. భీమడోలులోని 90, 92, 95, సూరప్పగూడెంలోని 100, 101 పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్వోల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల నమోదు, తొలగింపు, బదిలీల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను ఆయన పరిశీలించి వారికి తగు సూచనలందించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని, ఏదైనా లోపాలు జరిగితే అందుకు బీఎల్వోలదే బాధ్యత అన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో శని, ఆదివారం రెండు రోజుల్లో 160 దరఖాస్తులు అందాయన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

14న తహసీల్దార్ కార్యాలయాల వద్ద ప్రజాపోరు ధర్నా



గణపవరంలో ప్రజాపోరు పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

గణపవరం: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 14న అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ప్రజలతో కలిసి ధర్నాలు నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం గణపవరం సీపీఎం కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రజాపోరు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జక్కంశెట్టి మాట్లాడుతూ అన్ని రకాల సరకుల ధరలూ ఆకాశాన్నంటుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్లు ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపుతోందని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలేదని, కేంద్రం విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ప్రజాపోరు ఆందోళన చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెచ్చెట్టి నర్సింహమూర్తి, ఎం.పెంటారావు, చిన్నం చిన నాగేశ్వరరావు, సోడదాసి సంజీవరావు పాల్గొన్నారు.

సంగీతానికి పాచ్ఛా సాహెబ్ విశేష సేవలు



సంగీత విభావరిలో కీర్తనలు ఆలపిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రస్థాయిలో పేరు పొందిన ప్రముఖ సంగీత విద్వాంసుడు సయ్యద్ పాచ్ఛా సాహెబ్ సంగీత రంగానికి చేసిన సేవలు విశేషమైనవని అతిథులు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో పాచ్ఛా సాహెబ్ 25వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఏలూరుతో పాటు జిల్లాలోని అనేక మందికి వివిధ సంగీత వాయిద్యాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చిన సంగీత కళాకారులుగా తీర్చిదిద్దడంలో పాచ్ఛా సాహెబ్ విశేష కృషి చేశారన్నారు. ఆయన మనుమడిగా ఎస్‌పీఎస్ వాసు సంప్రదాయ సంగీత వాయిద్యాలతో పటు ఆధునిక వాయిద్యాల్లో ప్రావీణ్యం పొంది ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ స్థాపించి ఎంతోమందిని సంగీత కళాకారులుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. కార్యక్రమం అనంతరం ఎస్‌పీఎస్ వాసు సంగీత సారథ్యంలో వహిదా వాసు, చిన్నారి ఎస్‌పీఎస్ దీప్‌చంద్, వై.అర్జున రావు, పాడనా తీయగా కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులతో నిర్వహించిన సంగీత విభావరి సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది.

వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ

దెందులూరు: రామారావుగూడెం వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పర్వతనేని వెంకటకృష్ణమరాజు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఆదివారం మలకచర్లలోని ఆయన నివాసానికి పార్టీ దెందులూరు మండలం అధ్యక్షుడు కామిరెడ్డి నాని వెళ్లి పరామర్శించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఎంపీటీసీ కాలి ఇశ్రాయేలు, నాయకులు పర్వతనేని నరేంద్ర, పేరం ప్రసాద్, పుల్లా శివ ప్రసాదు, బాబ్జి కార్యకర్తలు ఉన్నారు. రామారావుగూడెంలో మాతృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కొత్తపల్లి వెంకటరమణను కామిరెడ్డి నానితోపాటు కాళీ ఇశ్రాయేలు, పార్టీ నాయకులు పరామర్శించారు.

జమిలి ఎన్నికలతో దేశ ఫెడరల్ వ్యవస్థకు భంగం

ఏలూరు (టూటౌన్): జమిలి ఎన్నికలు దేశ ఫెడరల్ వ్యవస్థకు భంగం కలిగిస్తాయని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజా పోరు యాత్రలో ఏలూరులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రాంతీయ పార్టీల మద్దతుతో అధికారంలో వచ్చినప్పటికీ తన మతోన్మాద ఆర్ఎస్ఎస్ విధానాన్ని ముందుకు తీసుకెళుతోందని దుయ్యబట్టారు. సీపీఎం నగర కార్యదర్శి పి కిషోర్ మాట్లాడుతూ ఏలూరులోని పలు కాలనీల్లో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, ప్రజలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పోరు యాత్ర వెంకటాపురం పరిధిలోని 19 డివిజన్ హరిప్రియ నగర్, కొత్తూరు ఇందిరమ్మ కాలనీల్లో సాగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఏ శ్యామల రాణి, కే లెనిన్, వి సాయిబాబు, బి జగన్నాథరావు, వీవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.